క్లుప్తంగా

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సబ్ స్టేషన్ నుంచి రిక్కాబజార్ ఫీడర్ వరకు విద్యుత్ లైన్ పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ సెక్షన్-5 ఏఈ ఆపరేషన్స్ ప్రభాకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో జెడ్పీసెంటర్, రాతి దర్వాజ, మోమినాన్, తుమ్మలగడ్డ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: కూసుమంచి మండలం పాలేరులోని బీ.పీ.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 28న నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎంపీడీఓలు ఎం.యర్రయ్య, శేషాద్రి వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ కంపెనీలు విద్యార్హతల ఆధారంగా యువతీ, యువకులకు ఎంపిక చేస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 88867 11991, 96423 33668 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సేవాలాల్ మండల కమిటీ ఎన్నిక

కామేపల్లి: సేవాలాల్ మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కొత్తలింగాలలో సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ బానోత్ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ కమిటీ ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా లకావత్ సురేష్, యువజన అధ్యక్షుడిగా బానోత్ బాలక్రిష్ణనాయక్, విద్యార్థి సంఘం మండలాధ్యక్షుడిగా బాసింగ్‌నాయక్ ఎన్నిక కాగా వీరికి సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ భారత్ కిషన్‌నాయక్ నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం కన్వీనర్ చందునాయక్, శ్రీనునాయక్, రామకృష్ణనాయక్, అనిల్, వీరన్న, గణేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో తమ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రిలు తెలిపారు. ఇన్ ఫోకామ్ సంస్థలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక కాగా వారిని అభినందించారు. ఇదిలా ఉండగా గురువారం గాయత్రి బ్యాంక్ సైతం తమ కళాశాలలో క్లర్క్, క్యాషియర్ ఉద్యోగాలకు మేనేజ్‌మెంట్ విద్యార్థులకు నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు, ఇన్ ఫోకామ్ బాధ్యులు విజయ్ జైస్వాల్, పియూష్ తివారి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	హరోమ్ హర
సాయిరాం	ఓఎంజీ (ఓ మంచి గోస్ట్), సీతా కల్యాణ వైభోగమే
ఆదిత్య	నింద
శ్రీనివాస	మహారాజ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	64	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	56	చుక్కకూర	3
బీర	48		20
దొండ	20	తోటకూర	4
పొట్లకాయ	60		20
చిక్కుడు	88	గోంగూర	4
గోరుచిక్కుడు	66		20
క్యాబేజీ	30	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	40	కొత్తిమీర	1
చామగడ్డ	40		50
క్యారెట్	50	పుదీన	1
క్యాప్సికం	80		30

-ఖమ్మం వ్యవసాయం

పల్లెల్లో ప్రత్యేక పాట్లు..!

ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజల అవస్థలు

- పారిశుద్ధ్యం లోపించి కంపుకొడుతున్న వీధులు
- తాగునీరు సరఫరా లేక ఇబ్బందులు
- వీధి లైట్లు వెలగక చిమ్మచీకట్లో గ్రామాలు
- కుక్కల స్వైరవిహారంతో బెంబేలు
- పట్టించుకోని పాలకులు, ప్రత్యేకాధికారులు


పెదతండాలో సైడ్‌కాల్వలో పేరుకుపోయిన మురుగు


జలగంనగర్‌లో వీధి వెంట చెత్త


ఇళ్ల పరిసరాల్లో చిట్టడవిని తలపిస్తున్న సైడ్‌కాల్వ

ఖమ్మంరూరల్: గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజల బాధలు వర్ణనాతీతంగా మారాయి. వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఏ వీధిలో చూసినా చెత్త చెదారం పేరుకుపోవడం, మురుగు కాల్వలు దుర్వాసన రావడం, వీధిలైట్లు వెలగకపోవడం, తాగునీరు సమృద్ధిగా రాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కనీసం వీధుల్లో ఉన్న చెత్తను నెలకోసారైనా తొలగించడలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌లు ఉన్న సమయాన ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కారమయ్యేయని ఇప్పుడు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గ్రామకార్యదర్శికి చెబితే నాదేముంది.. ప్రత్యేకాధికారి చెప్పండి, అయినా నిధుల్లేవు ఎలా పని చేస్తాం అని ఎదురు సమాధానం చెబుతున్నారంటూ ప్రజలు వాపోతున్నారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంలో గత వారం క్రితం పైవీధిలోని కాలనీలో వీధిలైట్లు వెలగకపోవడంతో కాలనీవాసులు చిమ్మచీకట్లోనే ఉండాల్సిన పరిస్థితి దాపురించింది.

పత్తాలేని ప్రత్యేకాధికారులు..

ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రత్యేకాధికారులు గ్రామాల్లో అడ్రస్ లేరు. అయితే ప్రత్యేకాధికారులకు పంచాయతీల విధులతో పాటు పలు రకాల విధులు ఉండడంతో వారు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. దీంతో ఆయా పంచాయతీల పాలన కుంటుపడి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. కార్పొరేషన్‌లో విలీనమై పంచాయతీలతో పాటు అన్ని గ్రామాల్లో పాలన కుంటుపడింది. కనీసం సైడ్ కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే నాథుడే కరువయ్యారు. గ్రామ సమస్యలు చెబుదామంటే ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు.

సర్పంచ్‌ల పాలనే బెటర్..

వాస్తవంగా గ్రామపంచాయతీకి సర్పంచ్ ఉంటే తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉండేదని ఆయా గ్రామస్తులు పేర్కొంటున్నారు. సర్పంచ్ తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధి కావడంతో పాటు ఆయన తమకు నిత్యం అందుబాటులో ఉండేవారని, ఒకవేళ సర్పంచ్ పనిచేయకుంటే నిలదీసైనా పని చేయించుకునే హక్కు తమకు ఉండేదంటున్నారు. సర్పంచ్ లేకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇక ఈ వర్షాకాలంలో కలుషితమైన తాగునీరు లేకుండా ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాల్సి ఉంది.

వీడని కుక్కల బెడద.

పంచాయతీల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా ఉండి దారిన పోయేవారిని కరవడంతో పలువురు గాయపడ్డారు. మండలంలోని ఆరేకోడులో గత వారం రోజుల్లోనే ముగ్గురిని కుక్కలు కరిచి గాయపరిచాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఊహించవచ్చు. జలగంనగర్‌లోని సాక్షాత్తు ఎంపీడీఓ కార్యాలయం సమీపాన వీధిలో సైడ్ కాల్వలలో పేరుకుపోయిన మురుగునీటిని గత రెండు నెలల నుంచి తొలగించకపోవడంతో దుర్వాసన భరించలేక కార్యాలయ అధికారులు, సిబ్బంది ముక్కు మూసుకుని పోతున్నారే తప్ప తొలగించడానికి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఈవర్షాకాలం సీజన్‌లో ఇంకా కుక్కల బెడద ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున కుక్కల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేకాధికారుల విధులు..

గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించి వారికి కొన్ని నియమ, నిబంధనలు విధించింది. ఈమేరకు శుద్ధమైన తాగునీటి అందించడం, మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగుచేయించడం, సైడ్ కాల్వల్లో చెత్తచెదారం పేరుకుపోకుండా శుభ్రం చేయడం, కుక్కల బెడద తొలగించడం,వెలగని వీధిలైట్లను అమర్చాలి. కానీ ఆ దిశగా ఏ గ్రామాల్లోనూ జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తాం. ఇప్పటికే కార్యదర్శులతో పాటు సంబంధిత ప్రత్యేకాధికారులను అప్రమత్తం చేశాం. ఎన్ని పనులున్నా వారికి కేటాయించిన గ్రామాల్లో పాలనపై దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పాం. ఇక నుంచి పంచాయతీల్లో సమస్యలు రానీయం.

– కుమార్, ఎంపీడీఓ

కుక్కల బెడద ఎక్కువైంది..



గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా వీధుల వెంబడి కుక్కలు ఉంటున్నాయి. బయట తిరగాలంటేనే భయమేస్తోంది. ఇప్పటి గ్రామంలో ఐదుగురిని కుక్కలు కరిచాయి. ఇంకా ఏమీ జరుగుతుందో ఏమో తెలియడంలేదు. ఈవిషయమై అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– చల్లా హన్మంతు, గుదిమళ్ల

దోమలతో ఇబ్బంది..



అసలే వానాకాలం మొదలైంది. ఇప్పటికే సైడ్‌కాల్వల్లో పేరుకుపోయిన మురుగునీటిలో దోమలు చేరి జ్వరాల బారిన పడుతున్నాం. ఈ వానాకాలంలో దోమలు ఇంకా ఎక్కువై టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడకుండా నెలలకోసారైనా మురుగునీటిని తొలగించాలి.

– అంజమ్మ, జలగంనగర్

వైకుంఠధామాన్ని సందర్శించిన మేయర్


వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగర పాలకసంస్థ పరిధిలో గల ప్రకాశ్‌నగర్ మున్నేరు పక్కన ఉన్న వైకుంఠధామాన్ని మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం సందర్శించారు. గతేడాది వచ్చిన వరదలతో మరమ్మతులకు గురైన కాంపౌండ్ వాల్, ఆర్చి, గేట్లు తదితర వాటిని పరిశీలించారు. వైకుంఠధామంలో మరమ్మతులకు అంచనాలు రూపొందించి, త్వరగా పనులు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. పిచ్చి మొక్కలను తొలగించి, పూలు, నీడనిచ్చే మొక్కలను నాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జలలక్ష్మి, డీఈ మాధవి, నవ్యజ్యోతి, ఎస్ఐ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడం చరిత్రాత్మకం

ఖమ్మంరూరల్: గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని నిర్ణయించడం చరిత్రాత్మకమని ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మద్ది మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతుల రుణమాఫీ కోసం ఎంతలా ఎదురు చూసినా విడతల వారీ మాఫీ రైతులకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుండడం కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుందనడానికి నిదర్శమని చెప్పారు.

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: ఐదారు నెలలుగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, కార్మికులకు వేతనాలు చెల్లించడంతో పాటు మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత కేటగిరీలు కొనసాగించాలని సీఐటీయూ ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డులు, హరితహారం, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు తదితర పనులను పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్నారన్నారు. సంవత్సరాల తరబడి పంచాయతీ కార్మికులుగా పని చేస్తున్నా వీరికి శ్రమకు తగిన వేతనం అందడం లేదన్నారు. సంఘ నాయకులు సుధాకర్, కె.నాగరాజు, హుస్సేన్, నాగేశ్వరరావు, పుల్లయ్య, రహీమ్, లాలయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం చేయొద్దు..

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్‌లో ఇళ్లస్థలాల విషయమై నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు పేర్కొన్నారు. తన ప్లాట్‌లో ఇతరులు నిర్మాణం చేపట్టారని ఆరోపిస్తున్న నాగమణి, వివిధ సంఘాల బాధ్యులతో కలిసి బుధవారం ఆయన తహసీల్దార్ విల్సన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు నాగమణికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే ఆర్థిక కారణాల దృష్ట్యా నిర్మించుకోలేదని తెలిపారు. ఇంతలోనే ఇంకొకరు ఇల్లు నిర్మించుకున్న విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇకనైనా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బానోతు బద్రునాయక్, భూక్యా ఉపేంద్రబాయి, మామిడాల ఝాన్సీ, జయ, స్పందన, జ్యోతి, రవీందర్‌నాయక్, పెళ్లూరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యాన పాఠశాలల బంద్


ఖమ్మం మామిళ్లగూడెం: పాఠశాలలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కూసుమంచి/ఖమ్మంమామిళ్లగూడెం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఏబీవీపీ విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం పలు పాఠశాలలను బంద్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చకపోవడం, ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తుండడంతో విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా ఇన్‌చార్జ్ చావా సాయిప్రణీత్, ఏబీవీపీ నాయకులు వీరభద్ర, సచిన్, ఈశ్వర్, విజయ్, అఖి, ఫణి, ఆశిష్, ముఖేష్, మహేందర్ నాయక్, మహేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి వి.నరేష్, పొన్నం ఉపేందర్, గోపీనాయుడు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ముక్కు మూయాల్సిందే..!



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నా.. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వ్యర్థాలు రోడ్ల వెంటనే గుట్టలుగా పడుతున్నాయి. కేఎంసీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్త బస్టాండ్ పక్కన పోస్తున్న వ్యర్థాలు కుళ్లి దుర్వాసన రావడంతో పాటు ఇదిగో ఇలా పందులు తిరగడంతో మరింత దుర్గంధం వెలువడుతుంది. అంతేకాక ఆ వ్యర్థాల్లో తిరిగిన పందులు బయట సంచరించడంతో స్థానికులూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక బస్టాండ్‌కు వెళ్లే వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వ్యర్థాలపై పారిశుద్ధ్య సిబ్బందికి ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని, శివారు ప్రాంతాల్లో పరిస్థితి ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్

జనార్దన్‌రావు సేవలు మరువలేనివి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని వాసవి భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కొత్తా జనార్దన్‌రావు సంతాప సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంభాని మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి కీలక పాత్ర పోషించిన జనార్దన్‌రావు సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం వృథా కాదు..

ఖమ్మంరూరల్: అమరుల త్యాగం వృథా కాదని, నేటి తరానికి ఆదర్శమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండాపురంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు గుర్రం సూరయ్య, గుర్రం వెంకటనారాయణల వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సూరయ్య పేదల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని, వారి సేవలను నేటికీ ఇక్కడి ప్రజలు మర్చిపోలేదన్నారు. వారిద్దరి మృతి సీపీఎం ఉద్యమానికి, ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.మోహన్‌రావు, డి.వెంకటేశ్వరరావు, టి.వీరభద్రయ్య, జయమ్మ, ఉపేందర్, గిరిప్రసాద్, కిషన్‌రావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

డీవీ కృష్ణ ఆశయసాధనకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ ఆశయసాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో కృష్ణ రెండో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం డీవీకే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిమ్మిడి హన్మంతరావు, ఎడ్లపల్లి నవీన్, సరోజన, పేర్ల భిక్షం, గడ్డం శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీపీఐ నాయకుడి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన సీపీఐ నాయకుడు మొగిలిచెర్ల రాము(38) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయకార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చినవెంకటరెడ్డి, పుచ్చకాయల కమలాకర్, భాస్కర్, పెద్దవెంకటరెడ్డి, రాము, రంగారావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

'నీట్'పై సమగ్ర విచారణ జరిపించాలి


నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశ వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూఆ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్‌కుమార్, జి.మస్తాన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల లక్ష్మీనారాయణలు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, విద్యార్థి, యువజన సంఘాల నాయకుల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అంతేకాక రోడ్డుపై బైఠాయించిన నిరసనకారులను పోలీసులు పక్కకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు మాట్లాడుతూ.. 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంతో మోదీ ప్రభుత్వం ఆటలాడుకుందన్నారు. ఒకే పరీక్షా కేంద్రంలో నీట్ పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు వేయడం పలు అనుమానాలు కలుగుతున్నాయని, దీనిపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, నింధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పవన్, మనోజ్, అయ్యప్ప, నరేష్, గోపి, సుధాకర్, రాజు, మనోజ్, వినోద్‌రావు, క్రాంతి, మణికంఠ, గోపి, శ్రీనివాసరావు, రమేష్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్: నీట్ పేపర్ లీక్ స్కామ్‌కు ప్రధాని మోదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, పీవైఎల్ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు టి.లక్ష్మణ్, ఎన్ఎస్‌యూఐ బాధ్యులు ఆసీఫ్, పీవైఎల్ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్‌లు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మంద సురేష్, రవీందర్, శోభన్, సత్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు వదిలితేనే భవిష్యత్..


తిరుమలాయపాలెం: పిండిప్రోలులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు, నాయకులు

మాదక ద్రవ్యాలకు అలవాటు పడి విద్యార్థులు, యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని పలువురు వక్తలు అన్నారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసుల ఆధ్వర్యాన పలు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టారు. విద్యార్థులచే రహదారులపై భారీ ర్యాలీలు తీసి ఆయా ప్రధాన కేంద్రాల్లో మానవహారం నిర్వహించారు. ఆ తర్వాత డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేయించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంరూరల్: వరంగల్‌క్రాస్‌రోడ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, యువత


నేలకొండపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు